


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 274 పేజీలు - 08 వెల - 05/-

బుధవారం 30-09-2026


నీటి లభ్యత ఉంటేనే పంటలు సాగు చేసుకోండి



# పల్లె పండుగ 3.0తో గ్రామీణ ప్రగతి

-పల్లె పండుగ 1.0, 2.0తో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు

- 100 రెట్లు ఎక్కువగా మినీ గోకులాలు
- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 6,500 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం
- అడవి తల్లిబాటలో 1,500 కి.మీ.కు పైగా రహదారుల నిర్మాణం
- గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ 3.0
- పల్లె పండుగ 3.0లో 6 వేల కి.మీ. సీసీ రోడ్లు, 9,500 కి.మీ. బీటీ రోడ్లు
- 22,500 మినీ గోకులాలు.. 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు
- కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధికి భారీ కార్యాచరణ

బ్లీచింగ్ పౌడర్ కొనలేని స్థితి నుంచి.. సొంతంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీలను తీసుకొచ్చాం

2





*'పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామ'ని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలిపారు. పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా 11,085 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారితో కలిసి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రారంభించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ పి.వి.ఎన్. మాధవ్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.*

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ఈ రెండున్నరేళ్లలో పల్లెపండుగ, జలజీవన్ మిషన్ - అమరజీవి జలధార, 15వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగం, 10 వేలకుపైగా పదోన్నతులు, డి.డి.ఒ. కార్యాలయాల ఏర్పాటు.. ఇలా ఎన్నో సంస్కరణలతో ఒకవైపు గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తూనే, మరోవైపు వ్యవస్థను బలోపేతం చేశాం. ఒకప్పుడు పంచాయతీలు బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి నుంచి,

## యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా..

- క్షిపణుల తయారీలోకి ప్రైవేట్ కంపెనీలు
- ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు
- యుద్ధ సమయంలో ఉత్పత్తికి ప్రత్యామ్నాయం
- డీఆర్‌డీవో టెక్నాలజీ బదిలీకి అనుమతి
- సరఫరా సమయం మెరుగుపడొచ్చని నివేదిక



యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది.

**ప్రైవేట్ కంపెనీలకు టెక్నాలజీ**

ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు.



వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి

## జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..

- ఏషియన్ గేమ్స్ మహిళల 4ఇ400 మీటర్ల రిలేలో భారత్‌కు స్వర్ణం
- కిరణ్ పహల్, పూవమ్మ, ప్రాచి, విద్యా రామ్‌రాజ్‌ల బృందం అద్భుత ప్రదర్శన
- ఉత్కంఠభరితమైన చివరి ల్యాప్‌లో బహ్రెయిన్‌పై విజయం

మిగతాది 2లో






## ఉగ్రవాదం పై రెడ్ లైన్ గీశాం

- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య

2



భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## కేంద్ర జల్‌శక్తి మంత్రితో రేవంత్ భేటీ

- మహారాష్ట్రతో అంగీకారం కుదిరేలా కేంద్రం చొరవ చూపాలి
- ఎఫ్ఆర్ఎల్ 0152 మీటర్ల స్థాయిలో నిర్మాణానికి ప్రతిపాదన
- గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీటి తరలింపుతో వ్యయం తగ్గింపు
- పాలమూరు--రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతు



ఢిల్లీ, సెప్టెంబరు 29: తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించినట్లు కేంద్ర మంత్రికి తెలిపారు.

మిగతాది 2లో

# యుద్ధం వస్తే క్షిపణుల కొరత రాకుండా..

డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు.

**పోటీతో ధరలు, డెలివరీపై ప్రభావం**

ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది.

**యుద్ధ సమయంలో ఉత్పత్తే కీలకం**

దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

**ఇక పోటీ తప్పనిసరి**

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

---

# ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.



# ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలపై రాహుల్ ఆరా!

వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా అధ్యక్ష పదవికి ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి చివరి వరకు గట్టి పోటీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. 'అధ్యక్ష పదవిని గెలిచేందుకు చాలా దగ్గరగా వచ్చాం. తర్వాత ఏం జరిగింది?' అని ఆయన ప్రశ్నించినట్లు వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహం వంటి అంశాలపై కూడా రాహుల్ గాంధీ వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు సమయంలో కన్నయ్య కుమార్ బాధ్యత తీసుకున్నారని కేసీ వేణుగోపాల్ ప్రస్తావించినట్లు సమాచారం. ఎన్నికల ముందు ఉన్న అంచనాలకు భిన్నంగా ఫలితాలు ఎందుకు వచ్చాయనే దానిపై ఆయన వివరణ కోరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. డీయూఎస్‌యూ కేంద్ర ప్యానెల్‌లో నాలుగు పదవులు ఉన్నాయి. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ గెలుచుకుంది. ఉపాధ్యక్ష పదవిని స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ గెలుచుకున్నారు. ఎన్ఎస్‌యూఐ ఒక్క పదవినీ దక్కించుకోలేకపోయింది. మాజీ ఎన్ఎస్‌యూఐ సభ్యుడు దీపాంశు షోకీన్ స్వతంత్రంగా పోటీ చేసి ఉపాధ్యక్ష పదవిని గెలవడం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. 2023, 2024 డీయూఎస్‌యూ ఎన్నికల్లో షోకీన్ ఎన్ఎస్‌యూఐ తరఫున ప్రచారం చేశారు. ఈసారి టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయన 30,615 ఓట్లు సాధించి ఏబీవీపీ అభ్యర్థిపై 13,705 ఓట్ల భారీ తేడాతో గెలిచారు. ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి 4,313 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. షోకీన్‌ను పార్టీలో ఎందుకు కొనసాగించలేకపోయారని రాహుల్ గాంధీ ప్రశ్నించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పెట్టిన కొన్ని షరతులు ఆమోదయోగ్యంగా లేవని కన్నయ్య కుమార్, జాఖడ్ వివరించినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారాన్ని నిర్వహించిన తీరుపై రాహుల్ సంతృప్తి చెందలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యువతతో మరింతగా మమేకం కావడానికి కాంగ్రెస్ ఇటీవల పలు కార్యక్రమాలు చేపడుతోంది. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో 'ఛాత్రోన్ కీ గూంజ్' పేరుతో విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ నగరాల్లో యువతతో సంబంధాలు పెంచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీయూఎస్‌యూ ఫలితం పార్టీ యువజన విభాగం బలంపై చర్చకు దారితీసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా జెన్-జీ యువత రాజకీయ అంశాలపై చూపుతున్న ఆసక్తి, విద్యార్థి ఉద్యమాలపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. డీయూఎస్‌యూ అధ్యక్ష పదవిలో ఏబీవీపీకి చెందిన యశ్ దబాస్ 24,576 ఓట్లు సాధించగా, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనా 22,523 ఓట్లు పొందారు. దీంతో 2,053 ఓట్ల తేడాతో దబాస్ విజయం సాధించారు. ఈ ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్‌యూఐ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత బలం వంటి అంశాలను కాంగ్రెస్ నాయకత్వం సమీక్షిస్తున్నట్లు సమాచారం.

# పల్లె పండుగ 3.0తో గ్రామీణ ప్రగతి

ఇప్పుడు తమ గ్రామానికి అవసరమైన పనులను తామే నిర్ణయించుకుని, తమ గ్రామ అభివృద్ధికి తామే ప్రణాళికలు రూపొందించుకునే స్థాయికి పంచాయతీ రాజ్ వ్యవస్థను తీసుకొచ్చాం.

**గత ఐదేళ్ల కంటే రెండేళ్లలోనే పదింతల రోడ్ల నిర్మాణం**

గత ప్రభుత్వం ఐదేళ్లలో 880 కి.మీ. సీసీ రోడ్లు నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ద్వారా కేవలం రెండేళ్లలోనే దానికి 10 రెట్లు ఎక్కువగా, దాదాపు 9,000 కి.మీ. సీసీ రోడ్లను పూర్తి చేశాం. గతంలో 304 మినీ గోకులాలు మాత్రమే నిర్మిస్తే, మనం దాదాపు 100 రెట్లు ఎక్కువగా, 30 వేలకు పైగా మినీ గోకులాలను నిర్మించాం. అలాగే, పల్లెపండుగ ద్వారా 13,326 గ్రామ పంచాయతీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో భాగంగా 1 లక్ష 15 వేల పంట కుంటలను నిర్మించడంతోపాటు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేశాం. మరోవైపు, 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీల్లో 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లను ఇప్పటికే పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మరింత మెరుగుపరచేందుకు అడవితల్లిబాట కార్యక్రమం కింద రూ.2,180 కోట్ల వ్యయంతో సుమారు 2,437 కిలోమీటర్ల రహదారులను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇందులో ఇప్పటికే 1500 కిలోమీటర్లకు పైగా అనుసంధాన రహదారులను నిర్మించాం. అలాగే, ఇప్పటివరకు రోడ్డు అనుసంధానం లేని బంజారా, యానాది, ఎరుకుల గిరిజన ఆవాసాలు ఉన్న ప్రాంతాల్లో, పల్లెపండుగ ద్వారా 167 ఆవాసాలకు 111.4 కి.మీ. మేర రహదారి సౌకర్యం కల్పించాం.

**పల్లెపండుగ 3.0తో గ్రామీణ ప్రగతికి కొత్త ఊపు**

ఈ రోజు ఇక్కడ మనం రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా, గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ అభివృద్ధిని పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లబోతున్నాం. రూ.50 వేల కోట్లతో పల్లెపండుగ, జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయబోతున్నాం. ఇందులో రూ.30 వేల కోట్లతో అక్టోబర్ 5న గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార కార్యక్రమం ద్వారా మల్టీ విలేజ్ స్కీమ్, సింగిల్ విలేజ్ స్కీమ్ పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నాం. అలాగే రూ.9 వేల కోట్లతో పల్లెపండుగ 1.0, 2.0 కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసి, ఈ రోజు రూ.11,085 కోట్లతో ప్రతిష్టాత్మకంగా పల్లెపండుగ 3.0ను ప్రారంభిస్తున్నాం. ఇందులో భాగంగా 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, మరో 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయబోతున్నాం. అలాగే, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండలు తదితర అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం.

**పైలెట్ ప్రాజెక్ట్ గా డొంక రోడ్ల అభివృద్ధి**

ఎన్నో ఏళ్లుగా రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించేందుకు డొంక రోడ్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముందుగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి నియోజకవర్గంలో ఒక డొంక రోడ్డును అభివృద్ధి చేయబోతున్నాం. ఆ తర్వాత 161 గ్రామీణ నియోజకవర్గాల్లో డొంక రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, రైతులు తమ పంటలను సులభంగా మార్కెట్‌కు తీసుకెళ్లేలా రహదారి సౌకర్యాన్ని మెరుగుపరచబోతున్నాం.

**ఉదయగిరి ఇక అభివృద్ధి బాటలో**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ.520 కోట్లతో పల్లెపండుగ పనులు చేపట్టాం. ఇంకా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టబోతున్నాం. మన ఉదయగిరిలోనే పల్లెపండుగ ద్వారా రూ.121 కోట్లతో 115 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లు, 1,200కు పైగా నీటి కుంటలు, 348 గోకులాలు, 190కి పైగా నీటి తొట్లు, సుమారు 900 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు వంటి అభివృద్ధి పనులను పూర్తి చేశాం. ఉదయగిరి నియోజకవర్గంలోని ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా, గతంలో నిలిచిపోయిన సుజల స్రవంతి పథకం ద్వారా రూ.52 కోట్లతో, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 381 పనులు చేపట్టబోతున్నాం. ఉదయగిరి కోటకు చేరుకునే మార్గంలో సుమారు 4 కి.మీ. రహదారిని రూ.2.5 కోట్లతో మంజూరు చేస్తున్నాం. దీనికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరగా పొందేలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశిస్తున్నాను. ఉదయగిరి కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసి, స్వదేశీ దర్శన్, సాస్కీ పథకాల ద్వారా అవసరమైన నిధులు సమకూర్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అలాగే, ఉదయగిరి కొండను హెరిటేజ్ టూరిజం ప్రాంతంగా, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉదయగిరిలో ఇప్పటికే క్రాఫ్ట్ ఉడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, వేప, బిక్కి, కల్ది, పాలబర్క్ వంటి చెక్కలను అందుబాటులోకి తీసుకొచ్చాం.

## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..

(మొదటి పేజీ తరువాయి)

రెండో ల్యాప్‌లో అనుభవజ్ఞురాలైన పూవమ్మ వేగాన్ని పెంచి భారత్‌ను పోటీలో ముందుకు తెచ్చింది. ఇప్పటికే వ్యక్తిగత 400 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్న ప్రాచి, మూడో ల్యాప్‌లో అదే ఊపును కొనసాగించి పతకాన్ని ఖాయం చేసే స్థితిలో నిలిపింది. ఇక చివరిదైన యాంకర్ లెగ్‌లో విద్యా రామ్‌రాజ్ తన సత్తా చాటింది. బహ్రెయిన్ అథ్లెట్ సల్వా ఈద్ నాసర్ నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, విద్యా ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. చివరి 200 మీటర్లలో తనదైన శైలిలో స్ప్రింట్ చేసి, ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయ రేఖను దాటింది. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ పోరులో బహ్రెయిన్ 3:30.21 సెకన్లతో రజతం, చైనా 3:31.02 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాయి. ఈ ఆసియా క్రీడల్లో విద్యా రామ్‌రాజ్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే 400 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం గెలుచుకున్న ఆమె, తాజాగా రిలే జట్టుకు స్వర్ణం అందించడంలో కీలక పాత్ర పోషించి బంగారు ముగింపు పలికింది. కొన్ని దశాబ్దాల నాటి జాతీయ రికార్డును బద్దలు కొట్టిన మరుసటి రోజే ఆమె ఈ ఘనత సాధించడం గమనార్హం. 4ఇ400 మీటర్ల రిలేలో బలమైన చరిత్ర ఉన్న భారత్, ఈ విజయంతో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.ద

## బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

## కేంద్ర జల్‌శక్తి మంత్రితో రేవంత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు సంబంధించిన వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, అనుమతుల అంశాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ం152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా కేంద్రం చొరవ తీసుకోవాలని సీఎం కోరారు. ఈ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. తద్వారా నీటి తరలింపునకు అవసరమైన విద్యుత్ వినియోగం, వ్యయం తగ్గుతుందని తెలిపారు.

**టెలీమెట్రీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి**

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఖ=వీదీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందని తెలిపారు. మొదటి దశతో పాటు రెండో, మూడో దశలకు సంబంధించిన టెలీమెట్రీ యంత్రాలను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నీటి లభ్యత ఉంటేనే పంటలు సాగు చేసుకోండి

మహానంది, పల్లె వెలుగు రబీ సీజన్లో పంటలు సాగు చేసుకోవాలనుకునే రైతులు,నీటి లభ్యత ఉంటేనే సాగు చేసుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పి. కవిత,డాక్టర్ ఎం. శివరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలంలోని నందిపల్లె,బొల్లవరం, తమడపల్లె, గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ..ఎల్నినో ప్రభావంతో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయిన దశలో ఉన్నాయన్నారు. బోరు కింద వరి సాగు చేసే రైతులు నీటి వసతిని బట్టి సాగు చేసుకోవాలన్నారు. ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఈర్నపాడులో భార్య భర్తలు ఆత్మహత్య





బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 29: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇరువురు భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథలు మేరకు ఉప్పరి గోపాలు అతని భార్య రమణమ్మ మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తుంది. ఇరువురు భార్యాభర్తలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. భార్యాభర్తలు ఇరువురు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నట్లుగా గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు ఈర్నపాడు గ్రామానికి చేరుకొని సంఘటనకు సంబంధించి విచారణ చేస్తున్నారు. భార్యాభర్తల మృతదేహాలను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## జొన్న పంటను పరిశీలించిన పరిశోధన శాస్త్రవేత్తలు



దొర్నిపాడు సెప్టెంబర్ 29 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలం లోని రామచంద్రాపురం గ్రామంలో జొన్న పంటను మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్ ఆధ్వర్యం లో నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అశోక్ కుమార్ నరసింహులుసందర్శించడం జరిగింది అని మండల వ్యవసాయ అధికారిని ప్రమీల తెలిపారు ఈ సందర్భంగ వారు మాట్లాడుతూజొన్న పంటలో మొవ్వ ఈగ ఆశించడం జరిగిందనినివారణకుథియోమెథక్సం 0.3గ్రవ ఒక లీటర్ చొప్పున పిచికారి చేసుకోవాలని సూచించారు.అలాగే కత్తెర పురుగు ఆశించడం మొదలు పెట్టిందని దీని నివారణకు వేప నూనె లేదా ఇమమెక్టిన్ బెంజోటే ఎకరానికి 100 గ్రాములు చొప్పున పిచికారి చేసుకోవాలని సూచించారు.ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలోరైతులువ్యవసాయసిబ్బంది పాల్గొన్నారు.

## వంటావార్పుతో వినూత్న నిరసన



బనగానపల్లె, సెప్టెంబర్ 29. పల్లెవెలుగు పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు వంటావార్పుతో వినూతన నిరసన చేశారు .మంగళవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం 13వ రోజుకు చేరుకుంది. 13వ రోజు వీఆర్ఏలు వంటావార్పుతో వినూతన నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు గౌస్ పీరా మాట్లాడుతూ 13 రోజులుగా తమ ఆందోళన కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సమస్యల పరిష్కారంపై స్పష్టమైన స్పందన లేకపోవడం దారుణం అన్నారు. తెలంగాణ తరహాలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వన్టైం సెటిల్మెంట్ ద్వారా వీఆర్ఏలుగా నియమించాలన్నారు. అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం ప్రమోషన్లు కల్పించాలని, మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులైన వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం ఉపాధ్యక్షులు తలారి బాలుడు, నాయకులు తలారి సుబ్రహ్మణ్యం, తలారి బాలకృష్ణ, కే. హరిబాబు, తలారి ప్రసాద్, తలారి శ్రీనివాసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## బాలిక విద్యను ప్రోత్సహిద్దాం

బనగానపల్లె, సెప్టెంబర్ 29, పల్లెవెలుగు బాలికల విద్యను ప్రోత్సహిద్దామని శ్రీ జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం



మండలంలోని గోవిందిన్నె ప్రాథమిక పాఠశాలలో శ్రీ జై కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె ఎస్ ఎస్ బ్రహ్మానందచారి ఆధ్వర్యంలో మనం ఫౌండేషన్ అధ్యక్షులు లాయర్ చక్రవర్తి సహకారంతో విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించాలని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలో అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలిక విద్య వల్ల కలిగే లాభాలను వివరించారు. హెచ్ఎం కే మౌనిక మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలు వివరించారు. విద్య విశిష్టత వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కే. మౌనిక, ఉపాధ్యాయురాలు ప్రియాంక, ఏఎన్ఎం పద్మావతి, బీసీ సంఘం నాయకుడు హరికృష్ణ గౌడ్, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ కమిటీలో జనసేన దూకుడు

హోళగుంద పల్లె వెలుగు సెప్టెంబర్ : 29 హోళగుంద మండలంలో ఎస్ఎంసీ కమిటీ



ఎన్నికల్లో జనసేన పార్టీ యువ నాయకులు సత్తా చాటారు. జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకప సహకారంతో, హోళగుంద మండల జనసేన కన్వీనర్ అశోక్ ఆధ్వర్యంలో యువ నాయకులు చురుకుగా వ్యవహరించారు. ఈ క్రమంలో హిరత్న వెంకటేష్, చిన్నహేట మల్లయ్య ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పదవికి పోటీ చేసి బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు, పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదలకు ఎస్ఎంసీ కమిటీ ద్వారా కృషి చేస్తామని తెలిపారు. యువ నాయకత్వానికి లభించిన ఈ విజయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.

## రాయలసీమ ఉద్యాన సమగ్ర అభివృద్ధిపై నేడు నంద్యాలలో భారీ డ్రోన్ షో.

**-ఆకాశంలో రంగురంగుల కాంతులతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఆవిష్కరణ.**

**-సాయంత్రం 5.30 గంటలకు కలెక్టరేట్ నుంచి ఔట్డోర్ స్టేడియం వరకు ట్రాక్టర్ల ర్యాలీ.**

**-పది రోజుల పాటు కళాజాత బృందాలతో హార్టికల్చర్ హబ్పై విస్తృత ప్రచారం.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నంద్యాల పట్టణంలో ఈనెల 30వ తేదీ బుధవారం భారీ డ్రోన్ షో నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం 5.30 గంటలకు నంద్యాల



కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్ నుంచి ఔట్డోర్ స్టేడియం వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ ర్యాలీ, డ్రోన్ షోలో జిల్లా మంత్రులు, జిల్లా కలెక్టర్, అధికారులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అదేవిధంగా, రాయలసీమ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలు, ప్రయోజనాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సెప్టెంబర్ 30వ తేదీ నుంచి పది రోజుల పాటు కళాజాత బృందాల ద్వారా జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. కళారూపాల ద్వారా ఉద్యాన అభివృద్ధి ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ఈ ప్రాజెక్టులో రైతులు, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఎరుకుల హక్కుల కోసం ఉద్యమిస్తాం!

**ఎరుకుల అభ్యున్నతికి కొత్త నాయకత్వం.**

**కర్నూలు జిల్లా ఎరుకుల సేవా సంఘం అధ్యక్షుడిగా మోపిరి వెంకటేష్ ఏకగ్రీవ ఎన్నిక.**



ఆదోని (పల్లె వెలుగు): కర్నూలు జిల్లాలో ఎరుకుల సమాజాన్ని మరింత ఐక్యంగా సంఘటితం చేసి, వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని నూతనంగా ఎన్నికైన కర్నూలు జిల్లా ఎరుకుల సేవా సంఘం అధ్యక్షుడు మోపిరి వెంకటేష్ తెలిపారు. ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రి దేవి సూచనల మేరకు కర్నూలు జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఆదోని తిరుమల నగర్కు చెందిన ఎరుకుల మోపిరి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాయలసీమ రీజియన్ కమిటీ అధ్యక్షులు మానుపాటి సూర్యుడు ఎన్నికకు పూర్తి సహకారం అందించారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్కు రాష్ట్ర కమిటీ నాయకులు అభినందనలు తెలిపారు. జిల్లాలోని ఎరుకుల కుటుంబాల సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఎరుకుల సమాజంలో ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఎరుకుల కుటుంబానికి అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎరుకుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంఘం తరఫున కార్యాచరణ చేపడతామని తెలిపారు. జిల్లాలో సంఘాన్ని మండలాలు, గ్రామాల స్థాయికి విస్తరించి కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎరుకుల సమాజానికి న్యాయం జరిగే వరకు సంఘం తరఫున గళం వినిపిస్తామని, సమాజ అభ్యున్నతికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని మోపిరి వెంకటేష్ స్పష్టం చేశారు. తనను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర, రాయలసీమ ప్రాంత నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కనిపించని మున్సిపల్ అధికారులు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.



రాష్ట్ర ప్రభుత్వం పటిస్తాత్మకముగా ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తుంది. నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఛాంబర్ వద్ద గోడకు మున్సిపల్ కార్యాలయంలో కేవలం బ్యానర్ దర్శనమిస్తుందని,




అధికారులు ఎక్కడ కనిపించని విషయం ఆలస్యముగా వెలుగులోకి రావడంతో పలువురు విమర్శించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే 28వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆర్భాటముగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక బ్యానర్ ప్రజలకు బాహాటముగా దర్శనమిస్తుంది. కానీ అధికారులు అక్కడ కనిపించకపోవడంతో ప్రజలు కంగుతిని ముక్కన వేలు వేసుకున్నారు. సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక తికమకై వెనుతిరిగినట్లు సమాచారం. మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధికారులు నిర్వహిస్తున్నారా లేదా అనే అయోమయంలో పట్టణ ప్రజలు పడ్డారు. ప్రతి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో వేలవేల పోయింది. నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక బ్యానర్ కనిపిస్తున్నా అధికారులు ఎక్కడ కూర్చున్నారో, ఎక్కడ ఉన్నారో, లేదో అనే విషయంపై ప్రజలు తరజన బర్జన పడినట్లు సమాచారం. జిల్లా అధికారులు స్పందించి నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రజల కోసం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక బ్యానర్ తో పాటు అధికారులు కూడా ఉండే విధముగా చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మహానంది మండలంలో ప్రశాంతంగా విద్యా కమిటీ ఎన్నికలు

మహానంది, పల్లె వెలుగు మహానంది



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రశాంత వాతావరణంలో విద్యా కమిటీ చైర్మన్ ల ఎన్నికలు మంగళవారం ముగిశాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యా కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య తెలిపారు. గాజులపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గా కొలిమి హుస్సేన్ భాష, వైస్ చైర్మన్ టి. లక్ష్మీదేవి, ఎంపీపీ ఎస్ పాఠశాల చైర్మన్ ఎం. హేమలత, వైస్ చైర్మన్ షేక్ మౌలాలి, మసీదుపురంలో ఎంపీపీ పాఠశాల చైర్మన్ నులక చందనం చిన్న బాల నర్సి, వైస్ చైర్మన్ పుస్తెల శ్రీలక్ష్మి, గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైర్మన్ బి.బాల మద్దిలేటి, వైస్ చైర్మన్ సి. కుమారి, తిమ్మాపురంలో జడ్పీ పాఠశాలలో చైర్మన్ బోడెద్దుల మహేశ్వరి , మోడల్ స్కూల్లో పాశం వెంకటసుబ్బయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహానంది దేవస్థానం చైర్మన్, మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, గాజులపల్లె తెదేపా నాయకులు, గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీశైల దేవస్థానం మాజీ ధర్మకర్త రవి స్వామి, తెలుగు గంగ 12వ బ్లాకు వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ క్రాంతి కుమార్ యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు రంగస్వామి, భాష్యం రాముడు గౌడ్ లు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్ లను శాలువలు పూలమాలతో ఘనంగా సత్కరించారు.పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మహానంది ఎస్ఐ ఎన్ రామ్మోహన్ రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఏకగ్రీవాల బాటలో విద్యాకమిటీ ల ఎన్నికలు:

మనీ ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 30:



బండి ఆత్మకూరు మండలంలో మంగళవారం జరిగిన విద్యా కమిటీల ఎన్నికలు ఏకగ్రీవాల బాటలో పయనించాయి. ఈర్నపాడు క్లస్టర్లో 10 పాఠశాలలు ఉండగా పది పాఠశాలలు ఏకగ్రీవంగా పాఠశాలల కమిటీ లను ఎన్నుకున్నారు. జడ్పీహెచ్ఎస్ బండి ఆత్మకూరు క్లస్టర్ లో 11 పాఠశాలలు ఉండగా 9 ఏకగ్రీవాల బాటలో పయనించాయి. ఎర్రగుంట్లలో ఎంపీపీ స్పెషల్ స్కూలుకు ఓటింగ్ పద్ధతిలో కమిటీలను ఎన్నుకున్నారు. సంత జుటూరు క్లస్టర్ లో 12 పాఠశాలలు ఉండగా 10 పాఠశాలలకు విద్యా కమిటీలకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. రెండింటికి మాత్రం ఎన్నికల పద్ధతిలో విద్యా కమిటీలను ఎన్నుకున్నారు. కస్తూరిబా కళాశాలలో నువ్వా నేను అంటూ విద్యా కమిటీ చైర్మన్ పదవికి మహిళలు పోటీలు పడ్డారు. తర్వాత వారంతకు వారే సర్దుకోవడంతో ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. కస్తూరిబా పాఠశాలకు విద్యా కమిటీ చైర్మన్గా పార్నపల్లి గ్రామానికి చెందిన బి ఉమాదేవి, ఉపాధ్యక్షులుగా పరమటూరు కు చెందిన అరుణలను ఎన్నుకొన్నారు. బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో బండి ఆత్మకూరు కు చెందిన వెంకట లక్ష్మమ్మను విద్యా కమిటీ చైర్మన్గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల



ప్రిన్సిపాల్ ఆబుదుర్ రా ఫీ పాఠశాల సిబ్బంది చైర్మన్ వెంకట లక్ష్మమ్మను సన్మానించారు. బండి ఆత్మకూరు మెయిన్ పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్గా బోయ శిరీష, వైస్ చైర్మన్ గా సాయి భారపు చౌడేశ్వరీ లను ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యా కమిటీలకు సంబంధించిన హక్కులను బాధ్యతలను గురించి వారికి వివరించారు. మండల విద్యాశాఖ అధికారులు యశోద, మోహన్ రెడ్డి ల పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గ్రామాలలో విద్యా కమిటీల ఎన్నికల విషయాన్ని దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతల విషయంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ జగన్మోహన్ ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఏ గ్రామంలో కూడా ఇలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికైన పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ లకు సభ్యులకు అధికారులు అభినందనలు తెలియజేశారు. పాఠశాలల అభివృద్ధి విషయంలో, డ్రాప్ అవుతు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విషయంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు శ్రద్ధ చూపాలని అధికార యంత్రాంగం కోరుకుంటుంది.

**ప్రశాంతంగా విద్యా కమిటీ ఎన్నికలు**

మండలంలో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రెండు సంవత్సరాల క్రితం విద్యా కమిటీ ఎన్నికలలో చైర్మన్ లను ఎన్నుకునేందుకుగాను రాజకీయ పార్టీలు నువ్వా నేనా అనే రీతిలో పోటీపడ్డాయి. ఎందుకో మంగళవారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల పట్ల ఏ రాజకీయ పార్టీలు కూడా ఆసక్తి కనపరచకపోవడం విశేషం. విద్యా కమిటీ పదవుల వల్ల పెద్దగా ఒనగూరింది ఏమీ లేదు అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవడంతో పాటు, అనవసరంగా ఎన్నికలలో తలదూర్చడం వల్ల తమ జోబు లకు చిల్లులు పడతాయేమో అన్న విషయాన్ని గ్రహించిన నాయకులు విద్యా కమిటీ ఎన్నికలపై పెద్దగా దృష్టి సారించలేదు. ఈ కారణంగా మండల విద్యాశాఖ అధికారులు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎలాంటి ఒత్తిడీలు లేకుండా పోయాయి. ఈ దఫా జరిగే ఎన్నికలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో, చాలా ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కస్తూరిబా, ఆదర్శ పాఠశాలల్లో అధిక భాగం మహిళలు చైర్మన్లుగా ఎంపిక అయ్యారు.

# పెసరవాయి పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక పెసరవాయి





ప్రాథమిక పాఠశాల, ఎంపీపీ ( ఎస్సీ ) రెండు పాఠశాల నందు నందు జరిగిన నూతన విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు సభ్యుల ఎన్నికలు గ్రామ టిడిపి నాయకురాలు ఒడ్డు లక్ష్మీదేవి, ఒడ్డు ప్రశాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి మేడం అధ్యక్షతన ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు జ్యోతి మేడం గారు మాట్లాడుతూ పాఠశాలకు మరియు గ్రామానికి మధ్య అనుసంధానం కోసం జరిగిన ఈ ఎన్నికల్లో నియమించబడిన సభ్యులందరూ పాఠశాల అభివృద్ధి కోసం మరియు విద్యార్థుల ప్రగతి గురించి అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా తమ వంతు కృషి చేయాలని కోరారు.

ఎన్నికల్లో భాగంగా సభ్యులందరూ కలిసి ఎం. జనార్దన్ చైర్మన్ గా మరియు ఎస్ సఖినాభి వైస్ చైర్మన్ గా (ఎంపీపీ ఎస్సీ పాఠశాల) రెండవ పాఠశాలలో బండపల్లి బాలకృష్ణ చైర్మన్ గా, పి.మహేశ్వరి వైస్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గ్రామ పెద్దలు లక్ష్మీదేవి మరియు ప్రశాంతి హాజరయ్యి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలియజేశారు. ప్రభుత్వము పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల చేత విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఎంతగానో కృషి చేస్తుందని అటు పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల మంచి భవిష్యత్తు గురించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలకు అభివృద్ధి బాటలు నడిపేందుకు ఎంతగానో కృషి చేస్తున్న ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాపారావు, రాజేష్ యాదవ్, ఉపాధ్యాయురాలు ఎస్. నాగలక్ష్మి. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు, ప్రసాద్ రెడ్డి, చిన్న పుల్లయ్య, గరటయ్య, శ్రీనివాసులు,స్వాములు నరసింహుడు, సూర్య మద్దిలేటి,మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసి ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులకు ఏకగ్రీవ విజయం.

**నూతన కమిటీ సభ్యులకు టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అభినందనలు.**



ఆదోని (పల్లె వెలుగు): జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో టీడీపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలకు టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాలోని వివిధ నియోజకవర్గాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రతి ఒక్కరికీ ఆమె ప్రత్యేకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ.. పాఠశాలల పురోగతిలోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడంలో ఎస్ఎంసీ సభ్యుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం



చేసేందుకు నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు చొరవ చూపాలని కోరారు. అధికారాన్ని ఒక బాధ్యతగా స్వీకరించి, పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉజ్జ్వల భవిష్యత్తు కోసం సమర్థవంతంగా పనిచేయాలని నూతన కమిటీ సభ్యులకు ఆమె సూచించారు.

జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ ఎం సి చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులందరికీ మరోసారి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## పాణ్యం మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం..

### -42 పాఠశాలల్లో ఎన్నికలు.. 41 చోట్ల ఏకగ్రీవం..

పాణ్యం సెప్టెంబరు 29 పల్లె వెలుగు : మండలంలోని ప్రభుత్వ యాజమాన్యంలోని వివిధ




పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ,మోడల్, ఆశ్రమ పాఠశాలలు కలిపి మొత్తం 45 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.వీటిలో 42 పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరగగా,41 పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీఎస్ గోనవరం పాఠశాలలో మాత్రం ఎన్నికల ప్రక్రియ ద్వారా చైర్మన్ను ఎన్నుకున్నారు.కాగా, ఎంపీపీఎస్ మద్దూరు, ఎంజేపీఏపీబీసీ నెరవాడ, జెడ్పీహెచ్ఎస్ పిన్నాపురం పాఠశాలల్లో అవసరమైన కోరం లేకపోవడంతో ఎన్నికలను నిర్వహించకుండా వాయిదా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా పడిన మూడు పాఠశాలల్లో తదుపరి ఎన్నికలు నిర్వహిస్తామని మండల విద్యాశాఖ అధికారులు కోటయ్య, సుబ్రహ్మణ్యం తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

దొర్నిపాడు సెప్టెంబర్ 29 పల్లె వెలుగు న్యూస్ ఎన్నికైన నూనత చైర్మన్, వైస్ చైర్మన్లు దొర్నిపాడు మండలంలోని 21 ప్రాథమిక, 5 ఉన్నత పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య



కమిటీ ఎన్నికలుమంగళవారంప్రశాంతంగముగిసినట్లుమండలవిద్యాధికారిమనోహర్ రెడ్డితెలిపారు. ఈ సందర్భంగఆయనమాట్లాడుతూదొర్నిపాడు జడ్పీపాఠశాల చైర్మన్గా జంగిటి



భాస్కర్, వైస్ చైర్మన్ గకృష్ణవేణిలు ఎంపికయ్యారు, వీరితోపాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఎస్ఎంసి ఎన్నికలలో నూతనచైర్మన్ వైస్ చైర్మన్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు, ఎంపీపీ స్పెషల్ స్కూల్ (హరిజనవాడ) చైర్మన్ మధుర, వైస్ చైర్మన్ వరలక్ష్మి, సభ్యులనుఏకగ్రీవంగఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయు లుప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగాయి, ఈసందర్భంగ రాజకీయ పార్టీలకు అతీతంగా టిడిపి నాయకులు సిద్ధి సత్యం, హుసేని నాయన గారి శీను వాసులు, సిద్ధి నారాయణ, రమేష్, పి శీను శేఖర్, లక్ష్మి నరసింహ యాదవ్ గడ్డం శివయ్య, పాదం శీను సీలయ్య, సుధాకర్ మల్లికార్జున విజయ్ వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు లు ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ఎంసి సభ్యులకు చైర్మన్ లకు వైస్ చైర్మన్ లకు అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడాలనిఎన్నికైన వారినికోరారు.

# కల్లూరు మండలంలో ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు మండల వ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీ





(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మండలంలోని మొత్తం 74 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా, అందులో 30 పాఠశాలల్లో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన వాటిలో 43 పాఠశాలల్లో చేతులెత్తే పద్ధతి ద్వారా, ఒక పాఠశాలలో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరిగాయి.



అలాగే మండల పరిధిలోని 140 ప్రైవేట్ పాఠశాలలకు గాను కేవలం 30 పాఠశాలల్లో పాలకవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మండలంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా సాగాయి.

ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు) ఎం. శ్రీనివాసులు, వణిజా కుమారి మాట్లాడుతూ.. ఎన్నికలను విజయవంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు

**- 48, 49 వార్డుల్లోని 5 పాఠశాలల్లో పాలకవర్గాలు ఏకగ్రీవం**

**- నూతన కమిటీలను సత్కరించిన కమ్మరి పార్వతమ్మ, రాఘవేంద్ర**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత



రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం 48, 49 వార్డుల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. మొత్తం ఐదు పాఠశాలల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీల వివరాలు:
ఇందిరా గాంధీ బీడీ వర్కర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల (ఈ/ఎం): చైర్మన్‌గా బి. త్రివేణి, వైస్ చైర్మన్‌గా బి. రంగమ్మ. ఇందిరా గాంధీ బీడీ వర్కర్స్ కాలనీ జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల: చైర్మన్‌గా షేక్ షాహిన్, వైస్ చైర్మన్‌గా షేక్ రిహానా. వీకర్ సెక్షన్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల (బీసీ కాలనీ): చైర్మన్‌గా రాజమణి, వైస్ చైర్మన్‌గా మనోహర్.
వీకర్ సెక్షన్ కాలనీ ఎంపీపీ ప్రాథమిక పాఠశాల (బీసీ కాలనీ): చైర్మన్‌గా రాజశేఖర్, వైస్ చైర్మన్‌గా షేక్ సమీనా. ఎన్టీఆర్ నగర్ ఎంపీపీ ప్రాథమిక పాఠశాల: చైర్మన్‌గా రియాజున్, వైస్ చైర్మన్‌గా ఫర్జానా. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ, 49వ వార్డు ఇన్‌చార్జ్ సుతారు రాఘవేంద్ర ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి పాలకవర్గం అంకితభావంతో కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ పీజీలో ర్యాంకు సాధించిన సాయి అనిలను అభినందించిన బీసీ ఇందిరా

బనగానపల్లె సెప్టెంబర్ 29, పల్లెవెలుగు పట్టణంలోని పెండేకంటి నగర్‌కు చెందిన ప్రభుత్వ



ఉపాధ్యాయుడు నేట్ల రామమోహన్ రెడ్డి కుమార్తె సాయి అనిల జాతీయ స్థాయి నీట్ (పీజీ) పరీక్షలో ర్యాంకు సాధించడంతో టిడిపి నియోజకవర్గ నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి అభినందించి సన్మానించారు . మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ ఇందిరా రెడ్డి సాయి అనిల ను, ఆమె తల్లిదండ్రులను అభినందించారు.సాయి అనిలను శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. సాయి అనిల పీజీ నీటిలో 720 మార్కులకు గాను 560 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 1537వ ర్యాంక్‌తో పాటు నంద్యాల జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవలందించాలని ఆమె ఆకాంక్షించారు.స్వగ్రామమైన నందవరంలో భవిష్యత్తులో ప్రతి నెలా ఒక రోజు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాలని సాయి అనిలకు బీసీ ఇందిరా రెడ్డి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలని, అందుకు తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఎస్ఎంసీ ఎన్నికల్లో సీపీఎం మద్దతుదారుల హవా.

ఆదోని (పల్లె వెలుగు): పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో సీపీఎం పార్టీ



బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. ఆదోని పరిధిలోని పాండవగల్ గ్రామంలోని పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్‌గా కే. మంజునాథ్ ఎన్నికయ్యారు. సీపీఎం పార్టీ బలపరిచిన



మొత్తం 8 మంది సభ్యులు ఎస్ఎంసీలో ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎరిగేరి హైస్కూల్ ఎస్ఎంసీ ఎన్నికల్లో సీపీఎం పార్టీ బలపరిచిన ఆరుగురు సభ్యులు విజయం సాధించగా, వైస్ చైర్మన్‌గా జే. మంచాలమ్మ ఎన్నికయ్యారు.పాండవగల్ ఎస్ఎంసీ సభ్యులుగా కే. పాండురంగ, ఎస్. అనీభాష, కే. కృష్ణ, కే. కొండయ్య, కే. రమేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఎరిగేరి హైస్కూల్ ఎస్ఎంసీ సభ్యులుగా హెచ్. నాగరాజు, ఎస్. వెంకటేశ్వరమ్మ, ఎం. భీమా, ఎస్. రాజాబి, వై. బుజ్జమ్మ, యు. ఈరమ్మ, జే. తిమ్మారెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందించేందుకు ఎస్ఎంసీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కౌవులూరు విద్యా కమిటీ నూతన చైర్మన్లకు ఘన సత్కారం..

పాణ్యం సెప్టెంబర్ 29 పల్లె వెలుగు : మండలంలోని కౌవులూరు గ్రామంలో విద్యా కమిటీ



చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని గ్రామ టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ నల్లల విజయభాస్కర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్లకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీ చైర్మన్లు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# ఉమ్మడి కర్నూలు జిల్లావైస్సార్సీపీ పార్టీ ఇంచార్జి ల సమావేశం నకు హాజరు అయిన బనగానపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె, సెప్టెంబర్ 29,పల్లెవెలుగు కర్నూలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం నందు రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి కర్నూలు జిల్లా నియోజకవర్గ వైఎస్సార్సీపీ పార్టీ ఇంచార్జీల సమావేశానికి హాజరు అయిన బనగానపల్లె మాజీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల మీద సమీక్షా సమావేశం.....
ఉమ్మడి కర్నూలు జిల్లా లో జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీ,నగర పంచాయతీ,జిల్లా పరిషత్,మండల పరిషత్, సర్పంచ్ ఎన్నికల్లో అన్ని చోట్ల పోటీ చేయాలి.
వైఎస్సార్సీపీ పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థులకు నియోజకవర్గ ఇంచార్జీలు అండగా ఉండాలి.
ఈ సమావేశం లో
వైఎస్సార్సీపీ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ చల్లా మధుసూదన్ రెడ్డి ,నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి ,మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ,నంద్యాల జిల్లా పార్టీ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ,కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎా.ఎ మోహన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి ,మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ,ఎమ్మెల్సీ ఇసాక్ బాషా , ఎమ్మెల్సీ మధుసూదన్ ,మాజీ మేయర్ బివై రామయ్య ,బుట్టరేణుక ,ఉమ్మడి కర్నూలు జిల్లా ల మాజీ శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి , శిల్పా చక్రపాణి రెడ్డి ,శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ,సాయి ప్రసాద్ రెడ్డి , కంగాటి శ్రీదేవి ,ఎా విజయ మనోహరి ,హాఫీజ్ ఖాన్ , బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ,మణి గాంధీ , కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , దారా సుధీర్, అహ్మద్ అలీఖాన్ ,ముఖ్య నేతలు పాల్గొన్నారు...

# స్కూల్ కమిటీలు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదం చేయాలి.

**రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎంసీ కమిటీలు విజయవంతం.**

**ఏపీ స్టేట్ కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప.**

ఆదోని (పల్లె వెలుగు): పాఠశాలల అభివృద్ధి,



విద్యార్థుల భవిష్యత్తుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ) కీలకంగా పనిచేయాలని ఏపీ స్టేట్ కురుబ-కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు.
ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామంలోని ఎంపీపీ కన్నడ పాఠశాల, ఎంపీపీ తెలుగు పాఠశాల, జడ్పీ హైస్కూల్‌లలో ఎస్ఎంసీ కమిటీలు ఏకగ్రీవంగా ఏర్పాటయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాన్వి దేవేంద్రప్ప హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎస్ఎంసీ సభ్యులు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరుకాని విద్యార్థులను గుర్తించి, డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు విద్యా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని దేవేంద్రప్ప తెలిపారు. విద్యార్థులకు తల్లికి వందనం, స్కూల్ బ్యాగులు, బూట్లు, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. 2025--26తో పోలిస్తే 2026--27లో ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి ఒక లక్ష మంది విద్యార్థులు చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సంఖ్యను తాను పేర్కొన్న ప్రభుత్వ కార్యక్రమాల ఫలితంగా ఆయన అభివర్ణించారు. నూతనంగా ఏర్పడిన స్కూల్ కమిటీలు వచ్చే విద్యా సంవత్సరం నాటికి మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలని దేవేంద్రప్ప కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరు, డ్రాప్‌అవుట్ల నివారణ వంటి అంశాలపై కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు బసవరాజు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, పాఠశాలల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్తీక్

**విరాళాలు సేకరిస్తున్న తోటి విద్యార్థులు**

బండి ఆత్మకూరు పల్లెవెలుగు సెప్టెంబర్ 29: బ్లడ్





క్యాన్సర్ వ్యాధికి గురై మండల పరిధిలో ఉన్న చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన అడ్డాకుల కార్తీక్ చెన్నై క్యాన్సర్ ఆస్పత్రిలో గత నాలుగు రోజుల నుండి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై పల్లె వెలుగులో కథనం ప్రచురించిన మేరకు మానవతా హృదయం ఉన్నవారు స్పందించి కార్తీక్ కుటుంబానికి ఉడత భక్తి సహాయం అందజేస్తున్నారు. బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్తీక్ తో పాటు విద్యనభ్యసించిన తోటి విద్యార్థులు కార్తీక్ ను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. నంద్యాల ప్రాంతంలో మంగళవారం విరాళాలు సేకరించడంలో తోటి విద్యార్థులు నిమగ్నమయ్యారు. కార్తీక్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు ప్రసాద్ శివరామకృష్ణ చారి తమ ప్రయత్నాలను చేస్తూనే ఉన్నారు. క్యాన్సర్ వ్యాధికి గురైన కార్తీక్ ను ఆదుకోవాలని తమ సంబంధికులను బంధుమిత్రులను చరవాణి ద్వారా సంప్రదించి ఆర్థిక సాయం అందజేయాలని అర్థిస్తున్నారు. బండి ఆత్మకూరు చెందిన జ్యోతి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హర్షవర్ధన్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని కార్తీక్ కుటుంబానికి అందజేశారు. బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి రెండు వేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి పంపించారు. కార్తీక్ ను ఆదుకునేందుకు దాతలు చాలామంది ముందుకు వస్తున్నారని, కార్తీక్ ఆరోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు వాకబు చేస్తున్నామని లెక్చరర్లు ప్రసాద్ శివరామకృష్ణ చారి తెలిపారు. ప్రజా ప్రతినిధులను కలిసి కార్తీకు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని అందజేయాలని అభ్యర్థిస్తామని లెక్చరర్లు పేర్కొంటున్నారు.

## మద్దూరు విద్యా కమిటీ నూతన చైర్మన్‌గా చాట్లా జయగోపాల్..

పాణ్యం సెప్టెంబరు 29 పల్లె వెలుగు : మండలంలోని మద్దూరు గ్రామ విద్యా కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన చాట్లా జయగోపాల్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన దూదేకుల బాబయ్య మంగళవారం స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డిని కర్నూలు మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మద్దూరు గ్రామ టీడీపీ నాయకులు, సింగిల్ విండో చైర్మన్ నరేంద్రనాథ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రమణ, శోభన్ బాబు, మహ్మద్ హుస్సేన్



తదితరులు వారిని అభినందించారు.

# గడివేముల మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలల గాను

# 37 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు పూర్తి.







గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలంలోని మండల విద్యాశాఖ అధికారులు సుబ్బరామిరెడ్డి, రాజేంద్రప్రసాద్ వారి పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలల నందు స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (రావీజ) ఎన్నికలు అత్యధిక చోట్ల ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. కేంద్ర ప్రభుత్వ 'ఎస్ఎంసి మార్గదర్శకాలు--2026' ప్రకారం, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా పర్యవేక్షణలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

మండలంలో ఉన్న 38 ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక జరిగింది. తిరుపాడు గ్రామంలో కమిటీ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా వేశారని మండల విద్యాశాఖ అధికారి సుబ్బరామిరెడ్డి, రాజేంద్రప్రసాద్ తెలిపారు. గడివేముల మండలం కూటమి నాయకులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో మెజారిటీ పాఠశాలల్లో ఈ విద్యా కమిటీ చైర్మన్ల ఎంపిక పోటీ లేకుండా ఏకగ్రీవంగా సాగింది.ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లు మరియు సభ్యులను ప్రమాణ స్వీకారం చేసి, అనంతరం జరిగిన మొదటి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడంతోపాటు విద్యార్థుల భవిష్యత్తును బంగారు బాటలో నడిపేందుకు కృషి చేస్తున్న మన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వారికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు, ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు మంచి మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మంచి మేధాశక్తి కలిగిన ఉపాధ్యాయులు విద్యనుబోధించడం అది కేవలం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యం అవుతుంది.పాఠశాలల మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల మరియు మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణలో ఈ నూతన విద్యా కమిటీలు కీలక పాత్ర పోషించనున్నాయి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామాల కూటమి నాయకులు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ కుర్చీకి అఘోవపరిచిన సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర.







పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా కేంద్రంలోని , నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ కుర్చీకి సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర అఘోవపరిచినట్లు పలువురు వాపోయారు. వివరాల్లోకి వెళితే నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర దర్జాగా సబ్ రిజిస్టర్ కుర్చీలో కూర్చుని తన పనులు కొనసాగిస్తున్నాడు. సబ్ రిజిస్టర్ కుర్చీలో కూర్చొని పనులు కొనసాగిస్తుండగా ఒక జర్నలిస్ట్ తన సెల్లు తో ఫోటో తీస్తుండగా సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర రంకెలు వేస్తూ జర్నలిస్టుపై కాలు దువ్వి ఘర్షణకు దిగాడు. సబ్ రిజిస్టర్ కుర్చీలో ఒక సీనియర్ అసిస్టెంట్ కూర్చోడం తప్పు కదా అని జర్నలిస్టు అడగగా సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర వాదోపవాదాలకు దిగి కూర్చుంటే ఏంటి అని ధీమగ రంకెలు వేశాడు. నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగిన విషయం జిల్లా రిజిస్టర్ అశోక్ కు తెలపగా జిల్లా రిజిస్టర్ తెలియక చేశాడు అంటూ దాటవేస్తూ తన సిబ్బందికే సపోర్ట్ చేస్తున్నాడు. నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగిన విషయముపై జిల్లా అధికారికి తెలిపిన కూడా ఏమాత్రం స్పందించకపోవడంతో పలువురు విమర్శించుకుంటున్నారు. నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగిన సంఘటన మరి ఎవరి దృష్టికి తీసుకువెళ్లాలో అర్థం కావడం లేదని పలువురు వాపోతున్నారు. ఏదేమైనా జిల్లా కలెక్టర్ స్పందించి నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ కుర్చీకి అఘోవపరిచిన సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పై చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# కస్తూరిబా బాలికల పాఠశాల చైర్మన్‌గా బోయ రాధమ్మ

## వైస్ చైర్మన్‌గా మల్లయ్య




హోళగుంద పల్లె వెలుగు సెప్టెంబర్ : 29హోళగుంద మండలంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా బోయ రాధమ్మ, వైస్ చైర్మన్‌గా కే. మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు, మండల కన్వీనర్ తిప్పయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. చైర్మన్‌గా బోయ రాధమ్మ, వైస్ చైర్మన్‌గా కే. మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు కూటమి నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కమిటీ సమన్వయంతో పనిచేయాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో హోళగుంద కూటమి నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పాల కేంద్రం గేటు వద్దే సర్వసభ్య సభ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పాల కేంద్రంలో నిర్వహించాల్సిన 39వ సర్వసభ్య సమావేశం సమావేశ భవనంలో కాకుండా గేటు ముందున్న రోడ్డుపైనే నిర్వహించాల్సి వచ్చిందని పాల కేంద్రం ఛైర్మన్ ఎస్ వి జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తనతో పాటు డైరెక్టర్లను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని తెలిపారు.

ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సమావేశానికి అడ్డంకులు కల్పించడం సమంజసం కాదని అన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండలో రోడ్డుపైనే సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సమావేశంలో అజెండాలోని అంశాలను డైరెక్టర్ల కు , సభ్యులకు ఛైర్మన్ ఎస్ వి జగన్‌మోహన్‌రెడ్డి చదివి వినిపించారు.

సమావేశానికి హాజరైన మహిళలు, డైరెక్టర్లు ఎండ తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. భోజనం చేసేందుకు మాత్రమే గేటు లోపలికి అనుమతించారని, అక్కడ కూడా భోజనం చేసే పరిస్థితి లేక రోడ్డుపైనే భోజనం చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి సంవత్సరం ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని సౌకర్యవంతమైన వాతావరణంలో నిర్వహించాల్సి ఉండగా, ఈసారి గేటు ముందు రోడ్డుపై నిర్వహించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని ఛైర్మన్ ఎస్ వి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



# మృతుల కుటుంబాలకు అండగా ఉమాపతి నాయుడు.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గంలోని చాగి గ్రామానికి చెందిన టీడీపీ



నాయకుడు రాము వదిన లక్ష్మి ఆటో ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు మంగళవారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా బైచిగిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త నరసింహ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉమాపతి నాయుడు గ్రామానికి వెళ్లి నరసింహ మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఉమాపతి నాయుడు అండగా నిలిచి, అంత్యక్రియలకు సంబంధించిన మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారి కుటుంబాలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

# యుద్ధప్రాతిపదికన గుర్రపు డెక్క తొలగింపు

## - కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు




పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహంలో కొట్టుకుపోకుండా వంతెనల పిల్లర్ల వద్ద పేరుకుపోతున్న గుర్రపు డెక్కను తొలగించే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం ఆయన అశోక్ నగర్, కేవీఆర్ కళాశాల, స్టాంటన్‌పురం, వినాయక ఘాట్, జోహరాపురం వంతెనల ప్రాంతాల్లో జరుగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం లేనప్పుడే నగర పరిధిలో 90 శాతం గుర్రపు డెక్కను తొలగించామని తెలిపారు. అయితే నీటి ప్రవాహం మొదలయ్యాక ఎగువ ప్రాంతాల్లో ఉన్న గుర్రపు డెక్క తరలివస్తూ నగర పరిధిలోని వంతెనల వద్ద నిలిచిపోతుందన్నారు. వంతెనల పిల్లర్ల వద్ద గుర్రపు డెక్క పేరుకుపోకుండా హైడ్రాలిక్ ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ పనులను పర్యవేక్షించేందుకు ప్రతి వంతెన వద్ద ఒక ప్రత్యేక అధికారిని నియమించామని, 2 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని కమిషనర్ వెల్లడించారు.కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ గిరిరాజ్, డీఈఈ పవన్, కుమార్ రెడ్డి, నరేష్, శ్రీనివాసన్, కృష్ణలత, హేమలత, ఇన్‌స్పెక్టర్లు అనిల్, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుడ్డా భూమి పూజ





బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 29: మండల కేంద్రమైన బండి ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి మంగళవారం భూమి పూజ శిల పలకాన్ని ఆవిష్కరించారు. బండి ఆత్మకూరు బస్టాండ్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు డబల్ రోడ్డు వేసేందుకు గాను పల్లె పండుగ 3.0 క్రింద కోటి 20 లక్షల రూపాయలు ఎమ్మెల్యే బుడ్డా మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇదే గ్రామంలో బీసీ కాలనీలో మురుగు కాలువలు రోడ్డు నిర్మాణాలకు గాను మరో కోటి 20 లక్షల రూపాయల నిధులను ఎమ్మెల్యే బుడ్డా మంజూరు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఎమ్మెల్యే బుడ్డా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు పలు గ్రామాలకు చెందిన తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకుమల్ల వీఁరూ మెయిన్ స్కూల్ చైర్మన్‌గా నాగజ్యోతి ఏకగ్రీవ ఎన్నిక



బనగానపల్లె, సెప్టెంబర్ 29,పల్లెవెలుగు సంజామల మండల పరిధిలోని ఆకుమల్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (వీఁరూ మెయిన్) నూతన పాఠశాల నిర్వహణ కమిటీ (రావీజ) చైర్మన్‌గా చాకలి నాగజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కమిటీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసే వ్యక్తిగా నాగజ్యోతిని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.?పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన నాగజ్యోతికి వైఎస్ఆర్సిపి నాయకుడు గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, ఉయ్యాలవాడ కాసిం బాషా,పేరం వెంకటేశ్వర్ రెడ్డి అభినందనలు తెలిపారు.

?ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొని నూతన చైర్మన్ నాగజ్యోతికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా పి బి శీలమన్న ఎన్నిక

బనగానపల్లె, సెప్టెంబర్ 29, పల్లెవెలుగు మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా పి బి శీలమన్న యాదవ్ ను, వైస్ చైర్మన్ గా శారదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మంగళవారం మండలంలోని నందవరం జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహించారు . ఎస్ఎంసి చైర్మన్ గా రెండవసారి పి బి శీలమన్న యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా పి.బి. ప్రసన్న ఎన్నిక మండలంలోని నందవరం గ్రామంలో ని మండల ప్రాథమిక పరిషత్ మెయిన్ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా పి.బి. ప్రసన్న యాదవ్, వైస్ చైర్మన్ గా వై.మౌనికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఎన్నికలను నిర్వహించారు చైర్మన్ ,వైస్ చైర్మన్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చెరుపల్లిలో స్వచ్ఛ రథాన్ని పరిశీలించిన ఎంపీడీవో

బనగానపల్లె , సెప్టెంబర్ 29, పల్లెవెలుగు మండలంలోని చెరువుపల్లె గ్రామంలో






ఎంపీడీవో నాగరాజు స్వచ్ఛ రథాన్ని పరిశీలించారు . మంగళవారం చెరువు పల్లె గ్రామంలో ఎంపీడీవో నాగరాజు డిప్యూటీ ఎంపీడీవో సురేంద్రనాథ్ యాదవ్ లు స్వేచ్ఛారథాన్ని పరిశీలించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు ఇండ్లలో పనికిరాని వస్తువులను గ్రామానికి స్వేచ్ఛారథం వచ్చినప్పుడు ఇచ్చి ఇండ్లలోనికి ఉపయోగపడే సరుకులను తీసుకోవాలన్నారు. ఇంటి వ్యర్థాలు ఇచ్చి నిత్యావసర సరుకులు తీసుకోవాలన్నారు.ప్రజలు తమ ఇండ్లలో పనికిరాని వస్తువులు ప్లాస్టిక్, పేపర్లు, గాజు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వంటివి గ్రామానికి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు అప్పగించాలని , అలా ఇచ్చిన వ్యర్థాలకు బదులుగా ఇండ్లలో ఉపయోగపడే నిత్యావసర సరుకులను తీసుకోవచ్చని ఆయన తెలిపారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి వ్యర్థాలను సేకరించి, వాటికి తూకం వేసి నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందని వివరించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ వినూత్న కార్యక్రమం ద్వారా గ్రామం శుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందని ఆయన అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్వచ్ఛ రథాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రుద్రవరం ఆదర్శ పాఠశాలలో నూతన ఎస్ ఎమ్ సి కార్యవర్గం ప్రమాణ స్వీకారం...



సెప్టెంబర్.పల్లె వెలుగు : రుద్రవరం ఆదర్శ పాఠశాల మరియు కళాశాల, పాఠశాలలో మేనేజ్మెంట్ కమిటీ కొత్త కార్యవర్గంగా బాలకృష్ణ చైర్మన్‌గా, పి .కాళవతి వైస్-చైర్మన్‌గా ఎన్నిక అయ్యారు.

ఆదర్శ పాఠశాల మరియు కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్త కార్యవర్గం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా కమిటి సభ్యులు, చైర్మన్ మరియు వైస్-చైర్‌పర్సన్‌లు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతి మరియు పాఠశాల సంక్షేమం కోసం తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు రంగయ్య గారు, శేఖర్ గారు, యువరాజు గారు, రుద్రవరం మండలం



నాయకులు పెద్దలు,తువ్వపల్లి నాయకులు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీ,ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త కార్యవర్గానికి అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖ వికాసం మరియు పాఠశాల అభివృద్ధికి కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని, కొత్త కార్యవర్గం పూర్తి సహకారం అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కల్లూరులో రూ.1.54 కోట్లతో సీసీ రోడ్ల పనులకు

# భూమిపూజ చేసిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నియోజకవర్గంలోని



ప్రతి కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి స్పష్టం చేశారు. కల్లూరు అర్బన్ పరిధిలోని పలు వార్డుల్లో సుమారు రూ.1.54 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు.

37వ వార్డు పరిధిలోని శాంతి నగర్ కాలనీలో రూ.40 లక్షలు, ఎన్టీఆర్ నగర్‌లో రూ.54 లక్షలు, అలాగే 41వ వార్డు అపూర్వ హోమ్స్ పరిధిలో రూ.60 లక్షల ప్రత్యేక నిధులతో అంతర్గత సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. కాలనీల్లో రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. పార్వతమ్మ, ప్రముఖ నాయకులు రాఘవేంద్ర, జవ్వాజి గంగాధర్ గౌడ్, కాసాని మహేష్ గౌడ్, మహమ్మద్ అలీ, ఇమ్మనియేలు, కురువ ధనుంజయ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 19 ఏళ్లుగా గోరుకల్లు తండా నిర్వాసితుల నరకయాతన.

**గిరిజన తండాలో కనీస మౌలిక వసతులు కల్పించాలి -- ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కె. రాజు నాయక్ డిమాండ్.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. గోరకల్లు తండా వాసులకు ఆదుకోవాలంటూ నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కి రైతులతో కలిసి జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, ఏ బి ఎస్ ఎస్ ఎస్ కే బాల నాయక్, అడ్వకేట్ విజయ్ నాయక్ వినతి పత్రం సమర్పించారు.

గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వస్వం కోల్పోయి నిర్వాసితులుగా మారిన గోరుకల్లు తండా గిరిజన కుటుంబాలు గత 19 ఏళ్లుగా కనీస మౌలిక వసతులు లేక నరకయాతన అనుభవిస్తున్నాతీరని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కె. రాజు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

నంద్యాల జిల్లా పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని గోరుకల్లు తండాలో సుమారు 150 గిరిజన కుటుంబాలు 2007లో రిజర్వాయర్ నిర్మాణం కోసం తమ ఇళ్లు, వ్యవసాయ భూములను వదులుకున్నాయని తెలిపారు. నిర్వాసితులకు పునరావాసం, మౌలిక వసతులు కల్పిస్తామని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొన్నారు.

డ్రైనేజీలు లేక వ్యాధుల బారిన పడ్డ గిరిజనులు

తండాలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపై నిలిచిపోతుండటంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని కె. రాజు నాయక్ తెలిపారు. దీంతో తండావాసులు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

19 ఏళ్లుగా నిర్వాసితులుగా జీవిస్తున్న కుటుంబాలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం బాధాకరమని, ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

హామీలను అమలు చేయాలి

రిజర్వాయర్ కోసం భూములు ఖాళీ చేయించే సమయంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పరిశీలించి అమలు చేయాలని కె. రాజు నాయక్, రవి నాయక్ బాలు నాయక్ డిమాండ్ చేశారు. అవార్డులో పేర్కొన్న ప్రకారం ప్రతి కుటుంబానికి సాగుభూమి, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం వంటి అంశాలపై సమగ్రంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

రూ.50 లక్షల ప్రతిపాదనకు వెంటనే నిధులు మంజూరు చేయాలి.

ఎంపీ ల్యాడ్స్ లేదా ఇతర అందుబాటులో ఉన్న ప్రభుత్వ నిధుల ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేసి డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల పనులను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నంద్యాల జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని గోరుకల్లు తండాను సందర్శించి, నిర్వాసితుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

19 ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న గిరిజన నిర్వాసితుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో తక్షణ పరిష్కారం చూపాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కె. రాజు నాయక్, గోరకల్లు తాండ రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో లాయర్ విజయ్ నాయక్ ,
లక్ష్మి నాయక్ , తిరుపాలు నాయక్ ,
హనుమ నాయక్ , రాయుడు నాయక్ , నందా నాయక్ , కృష్ణ నాయక్ ,
సురేంద్ర నాయక్ , బాబు నాయక్ ,
రాజా నాయక్ , శివ నాయక్ ,
దేవి బాయి , మంగీ బాయి ,
వెంకటి బాయి , బుజ్జి బాయి ,
శాంతి బాయి తదితరులు పాల్గొన్నారు.

## చెంచులక్ష్మి గిరిజన గూడెంను పరిశీలించిన ఐటీడీఏ పీవో

మహానంది, పల్లె వెలుగు మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడెంను ఐటీడీఏ పీవో పీవీఎస్ నాయుడు సందర్శించారు. మంగళవారం





గూడెంలో గిరిజన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గూడెం సందర్శించారు. వారి సమస్యలను తెలుసుకొని, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చిస్తామన్నారు.అనంతరం మహానంది క్షేత్రంలో స్వామి అమ్మ వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించిన బీసీ ఇందిరా

బనగానపల్లె, సెప్టెంబర్ 29, పల్లెవెలుగు దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 2 నుంచి 4 వరకు జరిగే వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్లను టిడిపి



నియోజకవర్గ నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి ఆవిష్కరించారు మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోదసరా పండుగ సందర్భంగా బనగానపల్లెలో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ పోస్టర్‌ను బీసీ ఇందిరారెడ్డి ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆలమూరు ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గా ఆర్ బాల గుర్రప్ప.

రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని ఆలమూరు ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ గా ఆర్ బాల గురప్ప, వైస్ చైర్మన్ గా పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పాఠశాల హెడ్మాస్టర్ సలావుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నికను నిర్వహించగా హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా చైర్మన్ గా ఆర్. బాల గురప్ప, వైస్ చైర్మన్ పద్మావతి లను కమిటీ సభ్యులను ఎన్నుకున్నారన్నారు. ఎన్నికైన వీరందరి చేత ప్రమాణం చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రజ్ఞా నరసింహారెడ్డి, టిడిపి నాయకులు బాచేపల్లి పత్తి వెంకటనారాయణ, వేణుగోపాల్, బాచేపల్లి పత్తి వెంకటరమణ, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పాండవగల్లు ఎస్ఎంసీ ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారుల విజయం

**-పాండవగల్లు ఎస్ఎంసీ చైర్మన్‌గా వైసీపీకి చెందిన లక్ష్మి ఎన్నిక**

**- వైస్‌చైర్మన్‌గా సీపీఎంకు చెందిన మంజునాథ్ ఏకగ్రీవం**

ఆదోని రూరల్ పల్లె వెలుగు పాండవగల్లు ఎస్ఎంసీ



ఎన్నికల్లో సీపీఎం మద్దతుతో వైసీపీ మద్దతుదారులు విజయం సాధించారు. చైర్మన్‌గా జె.లక్ష్మి, వైస్‌చైర్మన్‌గా కె.మంజునాథ్‌ను సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఫరీద్ సుల్తానా నూతన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని చైర్మన్, వైస్‌చైర్మన్ తెలిపారు. ఎన్నికకు సహకరించిన పెద్దలకు హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కూటమి మద్దతుదారులు ఎస్ఎంసీ ఎన్నికల్లో పోటీ



చేయాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పాండవగల్లులో కూటమి తరఫున అభ్యర్థులు బరిలోకి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో కూటమి శ్రేణుల్లోనే కాకుండా గ్రామంలోనూ దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, గ్రామంలోని ఓనాయకుడిగా ఉన్న వ్యక్తి వ్యవహారశైలి కారణంగా కొందరు నాయకులు ఆయనకు దూరమై వర్గాలుగా విడిపోయినట్లు స్థానికంగా సమాచారం వినిపిస్తోంది. ఈ అంతర్గత విభేదాల ప్రభావమే ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు పోటీకి రాకపోవడానికి కారణమని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు కె.పి. గిడ్డయ్య, మాజీ వైస్ సర్పంచ్ తిక్కయ్య, చిన్నారెడ్డి, చిన్నోడు, చిన్న అంజినయ్య, హనుమంత రెడ్డి, అహ్మద్ బాషా, అయ్యప్ప, చిన్న గిడ్డయ్య, పరమేష్,సిపిఎం నాయకులు పాండు, రామాంజనేయులు, అనీఫ్ భాష, కృష్ణ, గోవిందు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ తాయన్న, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం

**మచిలీపట్నం--కర్నూలు మధ్య విజయవాడ మీదుగా కొత్త రైలు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగర ప్రజల రైలు ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా మరో ముందడుగు పడింది. కర్నూలు సిటీ--విజయవాడ మధ్య కొత్త రైలు సర్వీస్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.



ఈ మేరకు కేంద్ర రైల్వే, సమాచార ప్రసార, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్.. మంత్రి టీజీ భరత్‌కు లేఖ రాశారు. మచిలీపట్నం--కర్నూలు సిటీ మధ్య విజయవాడ మీదుగా కొత్త రైలు ప్రవేశపెట్టేందుకు ఆమోదం లభించిందని కేంద్ర మంత్రి తన లేఖలో తెలిపారు.

కర్నూలు ప్రజలకు మెరుగైన రైలు కనెక్టివిటీ కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి టీజీ భరత్ 02-04-2025, 16-07-2026 తేదీల్లో కేంద్ర రైల్వే మంత్రికి లేఖలు రాశారు. ఆయన చేసిన విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలపడం పట్ల కర్నూలు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ .. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కి, నా విజ్ఞప్తికి స్పందించి మచిలీపట్నం -- విజయవాడ మీదుగా కర్నూలు సిటీ మధ్య కొత్త రైలు సర్వీసును మంజూరు చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ రైలు సర్వీసు ద్వారా కర్నూలు ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడటంతో పాటు, విజయవాడ మరియు మచిలీపట్నంతో కర్నూలుకు నేరుగా రైలు అనుసంధానం అందుబాటులోకి వస్తుంది. నా విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిరంతరం సహకరిస్తున్నందుకు మీకు నా కృతజ్ఞతలు అని అన్నారు.

# ఎస్ఎంసీ చైర్మన్‌గా రెండోసారి టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర ఏకగ్రీవ ఎన్నిక.

**స్థానిక ఎన్నికల్లో విజయానికి ఇదే శుభసూచకం: చాగి మల్లికార్జునరెడ్డి.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని నియోజకవర్గం ధనాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి దానాపురం చిన్న రామయ్యగారి రాఘవేంద్ర రెండోసారి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకున్నారు. ఆదోని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కె. మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించినట్లు కూటమి నాయకులు తెలిపారు. చైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన రాఘవేంద్రను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు చాగి మల్లికార్జునరెడ్డితో పాటు



పలువురు కూటమి నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఎస్ఎంసీ వైస్ చైర్మన్‌గా బీజేపీ నాయకురాలు పి. మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చాగి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లోనూ కూటమి విజయానికి ఇది శుభసూచకమని, విజయానికి దంకా మోగించినట్లేనని హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఎంసీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# రామదుర్గంలో కూటమి జోరు.. ఎస్ఎంసీ పీఠం టీడీపీకి.

**-చైర్మన్‌గా కుప్పగంటి శేఖర్.. వైస్ చైర్మన్‌గా మాదిగ చాపమ్మ.**

**-స్థానిక ఎన్నికలకు ముందే విజయ డంకా: టీడీపీ నాయకులు.**

ఆదోని (పల్లె వెలుగు): ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో కుప్పగంటి శేఖర్ చైర్మన్‌గా, మాదిగ చాపమ్మ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు, రామదుర్గం టీడీపీ ఇన్‌చార్జి బోయ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను టీడీపీ యువ నాయకుడు రామదుర్గం సోమశేఖర్ నాయుడు, బెల్లంకొండ రామచంద్రతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. నూతన ఎస్ఎంసీ కమిటీ పదవీ బాధ్యతలు స్వీకరించడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు రామదుర్గం సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ..



రామదుర్గంలో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవంగా, సజావుగా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలకు ముందే రామదుర్గంలో కూటమి బలాన్ని ఈ ఫలితం చాటిందని, స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి ఇది విజయ డంకా మోగించినట్లేనని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ఎస్ఎంసీ చైర్మన్ కుప్పగంటి శేఖర్, వైస్ చైర్మన్ మాదిగ చాపమ్మలకు గ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయ నెట్టికల్, బెల్లంకొండ శ్రీరాములు, బోయ గోవిందు, బోయ ఉలిగప్ప, హుసేని, కైలాస్, బెల్లంకొండ అయ్యప్ప, జనసేన నాయకుడు వలి తదితరులు పాల్గొన్నారు.



# సర్వే నంబర్ 360లో భూ వ్యవహారంపై విచారణ జరపాలి.. కలెక్టర్‌కు మానవ హక్కుల సంఘం వినతి

పోరుమామిళ్ల, సెప్టెంబర్ 29 ( పల్లె వెలుగు): పోరుమామిళ్ల మండలం సంచర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 360లో సుమారు 65 ఎకరాల భూమికి పూర్తి సబ్‌డివిజన్



జరగకముందే కొందరి పేర్లపై ఆన్‌లైన్‌లో భూమి నమోదు జరిగిందని ఆరోపిస్తూ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ముత్యాల ప్రసాద్ రావు జిల్లా కలెక్టర్, బద్వేల్ ఆర్డీవోకు 28/9/26 న వినతిపత్రం అందించారు. వినతిలో పేర్కొన్న వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం రాచర్లకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఒక్కొక్కరు ఐదు ఎకరాల చొప్పున మొత్తం 30 ఎకరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. అనంతరం భూమిని చదును చేసి, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని సుమారు ఆరు బోర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి మామిడి తోటలు సాగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. స్థానికులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలపై కూడా పూర్తి విచారణ జరిపించాలని కోరారు. రెవెన్యూ అధికారులు తక్షణమే పనులు నిలిపివేసి, భూ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, అక్రమాలు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముత్యాల ప్రసాద్ రావు విజ్ఞప్తి చేశారు.

# భూమి సమస్యపై డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం



పోరుమామిళ్ల, సెప్టెంబర్ 29 ( పల్లె వెలుగు) పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ, గిరి నగర్ కాలనీకి చెందిన చాట కొండు గురయ్య తండ్రి చాటకొండు గురయ్య రంగసముద్రం పంచాయతీకి చెందిన సర్వేనెంబర్ 13 0 6/2 గల 4.96 సెంట్లు భూమికి సంబంధించి 1989 వ సంవత్సరంలో తమ తండ్రి చాట కొండు గురయ్య కు ప్రభుత్వం వారు మంజూరు చేయడం జరిగింది. అప్పటి నుండి ప్రభుత్వం తమకు మంజూరు చేసిన భూమిలో వర్షాధార పంటలను వేసుకుంటూ ఇప్పటివరకు సాగు చేసుకుంటూ వ్యవసాయమే జీవనోపాధిగా జీవనం సాగిస్తున్నామన్నారు. పోరుమామిళ్ల,రెడ్డి నగర్ కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కల్లూరి రామకృష్ణారెడ్డి 2022లో తమ భూమిని ఆక్రమించుకోవాలని తనపై లేనిపోని ఆరోపణలు సృష్టించి ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. తాను కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్,ఎంజాయ్మెంట్ ఆర్డర్ ను తీసుకొని అన్ని ఉత్తర్వులను పొందినను రాజకీయ, ధన,కుల బలంతో రామకృష్ణారెడ్డి తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి తాలూకా స్థాయి అధికారుల నుండి ఉత్తర్వులు పొందినారని తరువాత తాను జెసి కోర్టుకు వెళ్లి విషయాన్ని తెలియపరిచారన్నారు.జెసి విచారణ చేసి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు లోబడి ఉంటామని ఉత్తర్వులు ఇచ్చారన్నారు. పోరుమామిళ్ల మండల డిప్యూటీ తాసిల్దారు తాలుకా స్థాయి అధికారులకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చి తనకు అన్యాయం చేస్తుందని ఆయన వాపోయారు. తన సమస్యను కలెక్టర్ తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. తదనంతరం డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.

# అవగాహనతోనే హెచ్ఐవీకి అడ్డుకట్ట.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. హెచ్ఐవీపై అవగాహనతోనే రహిత సమాజాన్ని సాధించవచ్చని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ గనోరే అన్నారు. మంగళవారం ఎయిడ్స్ నివారణ ప్రచారంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు నిర్వహించిన 5 కిలోమీటర్ల రెడ్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి



ఉండాలన్నారు. చికిత్స తీసుకోవడం ద్వారా హెచ్ఐవీతో జీవిస్తున్న వారు సాధారణ జీవితం కొనసాగించవచ్చని తెలిపారు. హెచ్ఐవీ పరీక్షలకు ఎలాంటి భయం, సిగ్గు అవసరం లేదని, యువత ముందుకు రావాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఓ. లలిత సూచించారు. రెడ్ రన్‌లో పురుషుల విభాగంలో ఆర్.బి. వినోద్ కుమార్, ఎం. యోగ ఓబులేసు, మహిళల విభాగంలో ఎం. సావిత్రిబాయి, ప్రసన్నలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అక్టోబర్ 8న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఎంహెచ్‌వో డాక్టర్ శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో వైద్య, క్రీడాశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

# కుక్కల నియంత్రణ కేంద్రంలో కమిషనర్ తనిఖీ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పట్టణంలోని కుక్కల నియంత్రణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న మంగళవారం తనిఖీ చేశారు. కుక్కల నియంత్రణ కేంద్రంలో చేపడుతున్న చర్యలు, నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. పట్టణంలో కుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

కుక్కల నియంత్రణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు నిరంతరం చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. కేంద్రంలో పరిశుభ్రతను క్రమం తప్పకుండా పాటించాలని సూచించారు.

కమిషనర్ వెంట మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com